## శ్రీ వికారి నామ సంవత్సరము

# వాతావరణం - పంటల ఉత్పత్తి - ధరల విశ్లేషణ

**వాతావరణం :**

ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయ ఆధారిత రాష్ట్రం. రాష్ట్రంలోని పంటల విస్తీర్ణం, పంటల సరళి మరియు పంటల దిగుబడి ముఖ్యంగా నైరుతి ఋతుపవనాల ప్రవేశం, విస్తరణ, పంటకాలంలో వీటి ద్వారా లభించే వర్షపాతం తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది. రాష్ట్రంలో జూన్ నుండి సెప్టెంబరు వరకు నైరుతి ఋతుపవనాల ప్రభావం వలన, అక్టోబరు నుండి డిసెంబరు వరకు ఈశాన్య ఋతుపవనాల ప్రభావం వలన వర్షాలు కురుస్తాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో నైఋతి ఋతుపవనాల ప్రభావం ఉండగా దక్షిణ కోస్తా మరియు రాయలసీమ ప్రాంతాలలో మాత్రం నైరుతి ఋతుపవన వర్షాలతో పాటు ఈశాన్య ఋతుపవనాల ప్రభావంతో కూడా వర్షాలు కురుస్తాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంవత్సర సాధారణ వర్షపాతం 966 మి.మీ కాగా, నైఋతి ఋతుపవనాల ద్వారా కోస్తా జిల్లాలలో 64 శాతం, రాయలసీమలో 42 శాతం చొప్పున మరియు ఈశాన్య ఋతుపవనాల ద్వారా కోస్తా ప్రాంతంలో 33 శాతం మరియు రాయలసీమలో 25 శాతం చొప్పున వర్షపాతం నమోదు అవుతున్నది.

సాదారణంగా నైరుతి ఋతుపవనాలు జూన్ మొదటి వారంలో రాష్ట్రంలో ప్రవేశించి, జూన్ మూడవ వారం లోపల రాష్ట్రమంతటా విస్తరిస్తాయి. గడిచిన ఐదు సంవత్సరాలలో నైరుతి ఋతుపవనాల ప్రవేశం, వర్షపాత విస్తరణ వివరాలు పరిశీలించినట్లైతే, ఋతుపవనాలు జూన్ 6-10 తేదీల మధ్య రాష్ట్రంలో ప్రవేశించి, జూన్ మూడవ వారంలో అన్ని జిల్లాలకు విస్తరించాయి. 2018వ సంవత్సరంలో నైరుతి ఋతుపవనాలు మే 29వ తేదీన కేరళలో మొదలై, జూన్ 4వ తేదీన రాయలసీమ మరియు కోస్తాలో ప్రవేశించి, జూన్ 8 నాటికి కోస్తా ప్రాంతమంతటా మరియు జూన్ 9 నాటికి కోస్తా మరియు రాయలసీమలోని అన్ని ప్రాంతాలకి విస్తరించాయి. అక్టోబర్ 5 మరియు 6 తేదీలలో నైరుతి ఋతుపవనాలు రాష్ట్రం నుంచి నిష్క్రమించగా ఈశాన్య ఋతుపవనాలు కోస్తా మరియు రాయలసీమ ప్రాంతాలలో అక్టోబరు 1 మరియు 2వ తేదీలలో ప్రవేశించి అక్టోబరు 21వ తేదీ నాటికి రాష్ట్రం మరియు భారతదేశం నుంచి పూర్తిగా నిష్క్రమించాయి.

**2018 వ సంవత్సరం దీర్ఘకాలిక వాతావరణ సూచనలు - పరిశీలన :**

2018 వ సంవత్సరంలో భారత వాతావరణ విభాగం, న్యూ ఢిల్లీ వారు, నైరుతి ఋతుపవనాల సమయంలో (జూన్-సెప్టెంబర్) సాధారణ వర్షపాతం కురిసే అవకాశం ఉందని దీర్ఘకాలిక ముందస్తు సూచనలు ఇవ్వడం జరిగినది. 2018 జూన్ నుండి సెప్టెంబర్ వరకు కురిసిన వర్షపాత వివరాలను గమనించినట్లైతే ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు అయినది.

ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి ఋతుపవనాల సమయంలో (జూన్-సెప్టెంబరు, 2018) 556 మి.మీ సాధారణ వర్షపాతమునకు గాను, 456.7 మి.మీ వర్షపాతం నమోదు అయినది. ఇది సాధారణ వర్షపాతం కంటే 17.9 శాతం తక్కువ. ప్రాంతాలవారీగా విశ్లేషించి చూసినట్లైతే నైరుతి ఋతుపవన కాలంలో, ఒక్క ఉత్తర కోస్తా ప్రాంతం తప్ప (2.7%) మిగిలిన అన్ని ప్రాంతాలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కాగా, ఈశాన్య ఋతుపవన కాలంలో అన్ని ప్రాంతాలలోను (దక్షిణ కోస్తా (-25.6%) మరియు రాయలసీమ (-40.7%)) సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయినది (పట్టిక 1). జిల్లాల వారీగా విశ్లేషించి చూసినట్లయితే, నైరుతి ఋతుపవనాల కాలంలో, శ్రీకాకుళం (8.7%), తూర్పు గోదావరి (4.3%), పశ్చిమ గోదావరి (12.5%), జిల్లాలలో సాధారణం కంటే కొంత ఎక్కువ వర్షపాతం నమోదు కాగా విజయనగరం (-9.3%), విశాఖపట్నం (-4.4%), కృష్ణా (-6.1%), గుంటూరు (-24.6%), ప్రకాశం (-42.5%), నెల్లూరు (-47.6%), చిత్తూరు (-35%), కడప (-48.6%), అనంతపురము (-37.2%) మరియు కర్నూలు (41.9%) జిల్లాలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అయినది (పట్టిక 2).

అంధ్రప్రదేశ్‌లో ఈశాన్య ఋతుపవనాల సమయంలో (అక్టోబరు-డిసెంబరు, 2018) 296 మి.మీ సాధారణ వర్షపాతమునకు గాను, 124.1 మి.మీ వర్షపాతం నమోదు అయినది. ఇది సాధారణ వర్షపాతం కంటే 58 శాతం తక్కువ. ఈ తక్కువ వర్షపాతం ఉత్తర కోస్తా (-44.5%), దక్షిణ కోస్తా (-60.78%) మరియు రాయలసీమలో (-66.40%) నమోదయినది. జిల్లాలవారీగా చూసినట్లయితే ఈ తక్కువ వర్షపాతం కర్నూలు (-75%), కడప మరియు ప్రకాశం (-74%), అనంతపురము (-68%), గుంటూరు (-62%), చిత్తూరు (-58%), తూర్పు గోదావరి మరియు నెల్లూరు (-57%), పశ్చిమ గోదావరి (-53%), విశాఖపట్నం (-52%), కృష్ణా (-48%), విజయనగరం (-44%) మరియు శ్రీకాకుళం (-16%) జిల్లాలలో నమోదు అయినది (పట్టిక 2).

రాష్ట్రంలో గడచిన ఐదు సంవత్సరాలలో నైరుతి ఋతుపవనాల సమయంలో మూడు సంవత్సరాలు (2015, 2016, 2017) సాధారణం గాను రెండు సంవత్సరములు (2014, 2108) సాధారణం కంటే తక్కువగాను వర్షపాతం నమోదు అయినది. అదే విధంగా ఈశాన్య ఋతుపవన కాలంలో గడచిన 5 సంవత్సరములలో కూడా సాధారణం కంటే తక్కువ నుంచి అతి తక్కువ వర్షపాతం చొప్పున నమోదు అయినది. (పట్టిక. 1).

పట్టిక 1 : రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో వర్షపాత (మి.మీ) వివరాలు (2014-18)

| ప్రాంతం | సాధారణ వర్షపాతం | | 2014 | | | | 2015 | | | | 2016 | | | | 2017 | | | | 2018 | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | నై | ఈ | నై | వ్యత్యాసం (%) | ఈ | వ్యత్యాసం (%) | నై | వ్యత్యాసం (%) | ఈ | వ్యత్యాసం (%) | నై | వ్యత్యాసం (%) | ఈ | వ్యత్యాసం (%) | నై | వ్యత్యాసం (%) | ఈ | వ్యత్యాసం (%) | నై | వ్యత్యాసం (%) | ఈ | వ్యత్యాసం (%) |
| ఉత్తర కోస్తా | 734.2 | 272.7 | 550.6 | -25 | 205.5 | -24.6 | 775.1 | 5.6 | 136.1 | -50.1 | 773.3 | 5.3 | 79.1 | -71 | 724.8 | -1.3 | 149.9 | -45 | 753.7 | 2.7 | 151.38 | -44.5 |
| దక్షిణ కోస్తా | 482.6 | 383.4 | 287.5 | -40.4 | 203.7 | -46.9 | 453.1 | -6.1 | 368.7 | -3.8 | 456.2 | -5.5 | 115 | -70 | 517.6 | 7.3 | 157.9 | -58.8 | 359.2 | -25.6 | 150.33 | -60.78 |
| రాయలసీమ | 406.6 | 237.8 | 241.1 | -40.7 | 119.8 | -49.6 | 334 | -17.9 | 362.1 | 52.3 | 362.6 | -10.8 | 69.2 | -70.9 | 461 | 13.4 | 227.7 | -4.3 | 241.2 | -40.7 | 79.9 | -66.40 |
| రాష్ట్రం | 556 | 296 | 374.4 | -32.7 | 178.6 | -39.7 | 522.4 | -6 | 287.1 | -3 | 533.7 | -4 | 85.4 | -71.1 | 567.1 | 2 | 177.5 | -40 | 474.62 | -14.63 | 129.06 | -56.40 |

నై : నైరుతి ఋతుపవనాల కాలం, ఈ : ఈశాన్య ఋతుపవనాల కాలం

మూలం: ఆర్థిక మరియు గణాంక సంచాలయము, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, విజయవాడ

**పట్టిక 2 : జిల్లా వారీగా నైరుతి మరియు ఈశాన్య ఋతుపవన కాలంలో నమోదయిన వర్షపాత వివరములు (2018)**

| క్ర.సంఖ్య | జిల్లా | నైరుతి ఋతుపవన కాలము | | | ఈశాన్య ఋతుపవన కాలము | | |
|---|---|---|---|---|---|---|---|
| | | సాధారణ వర్షపాతం | 2018 | వ్యత్యాసం (%) | సాధారణ వర్షపాతం | 2018 | వ్యత్యాసం (%) |
| 1. | శ్రీకాకుళం | 705.7 | 767.1 | 8.7 | 276.0 | 233.2 | -16 |
| 2. | విజయనాగరం | 692.7 | 628.0 | -9.3 | 245.9 | 137.7 | -44 |
| 3. | విశాఖపట్నం | 712.5 | 681.3 | -4.4 | 297.2 | 141.3 | -52 |
| 4. | తూర్పు గోదావరి | 768.1 | 801.4 | 4.3 | 305.4 | 132.1 | -57 |
| 5. | పశ్చిమ గోదావరి | 792.0 | 890.7 | 12.5 | 239.3 | 112.6 | -53 |
| 6. | కృష్ణా | 685.1 | 643.3 | -6.1 | 249.4 | 128.9 | -48 |
| 7. | గుంటూరు | 525.8 | 396.6 | -24.6 | 228.9 | 86.1 | -62 |
| 8. | ప్రకాశం | 388.3 | 223.2 | -42.5 | 393.7 | 103.3 | -74 |
| 9. | నెల్లూరు | 331.4 | 173.7 | -47.6 | 661.4 | 283.0 | -57 |
| 10. | చిత్తూరు | 439.4 | 285.4 | -35.0 | 395.4 | 167.7 | -58 |
| 11. | కడప | 393.5 | 202.3 | -48.6 | 251.0 | 65.2 | -74 |
| 12. | అనంతపురము | 338.4 | 212.6 | -37.2 | 155.3 | 49.8 | -68 |
| 13. | కర్నూలు | 455.1 | 264.5 | -41.9 | 149.5 | 36.9 | -75 |
| | రాష్ట్రం | 556.0 | 456.7 | -17.9 | 296.0 | 124.1 | -58 |

**మూలం :** ఆర్థిక మరియు గణాంక సంచాలయము, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, విజయవాడ

**2019వ సంవత్సరానికి (శ్రీ వికారి నామ సంవత్సరం) దీర్ఘకాలిక ముందస్తు వాతావరణ సూచనలు :**

సాధారణంగా భారత వాతావరణ సంస్థ, న్యూ ఢిల్లీ వారు 2019వ సంవత్సరపు ముందస్తు వాతావరణ అంచనాలను ఏప్రిల్ నెలలో విడుదల చేస్తారు. ఇప్పటి వరకు ఉన్న వాతావరణ పరిస్థితుల అంచనాలను బట్టి 2019వ సంవత్సరం జూన్ నుండి సెప్టెంబరు నెల వరకు భారతదేశంలో సాధారణ వర్షపాతం కానీ (లేక) సాధారణం కంటే కొంత తక్కువగాని వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయి. ఏప్రిల్ రెండవ పక్షంలో భారత వాతావరణ సంస్థ ద్వారా ఖచ్చితమైన అంచనాలు అందుతాయి. తిరిగి జూన్ మొదటి వారంలో సవరించబడిన ముందస్తు వాతావరణ సూచనలను భారత వాతావరణ శాఖ తెలియజేస్తుంది.

**వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రము :**

భారతదేశంలో వ్యవసాయ అభివృద్ధి చరిత్రను పరిశీలిస్తే, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గత 72 సంవత్సరాలుగా ఉత్పత్తి ఆధారిత వ్యవసాయమును చేయటం జరుగుచున్నది. పెరుగుతున్న జనాభాకనుగుణంగా ఆహారభద్రతను కల్పించటంలో వ్యవసాయ రంగం ప్రముఖ పాత్ర పోషిస్తున్నది. లోటు ఉత్పత్తి మరియు దిగుమతుల స్థాయి నుంచి మిగులు ఉత్పత్తిగా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందింది. వ్యవసాయదారుల ఆర్థిక స్థితిగతులపై పెరుగుతున్న సాగు వ్యయం రుణాత్మక ప్రభావం చూపించటం జరుగుతున్నది. దీనికి సరైన వ్యవసాయ మార్కెటింగ్

విధానాలు రైతులకు చేరకపోవడమే ముఖ్య కారణంగా చెప్పవచ్చు. రైతుల ఆర్థిక స్థితి పురోగాభివృద్ధికి ఖచ్చితమైన మార్కెట్ సమాచారం ఎంతగానో తోడ్పడుతుంది.

మార్కెట్ పరిశోధనల ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయములో వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం, గుంటూరులో వ్యవసాయ పంటలలో ముందస్తు ధరలను అంచనా వేయుటకు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన వారి ఆర్థిక సహాయంతో వ్యవసాయ మార్కెటు ఇంటెలిజెన్స్ కేంద్రం ఒక పరిశోధన పథకంగా స్థాపించబడటం జరిగింది.

**కేంద్ర ముఖ్య ఉద్దేశ్యాలు :**

- రాష్ట్రంలోని ప్రధాన వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ ధరలను వివిధ దశలలో నిరంతరం అంచనా వేయటంతో పాటు రైతులకు మరియు మార్కెట్ భాగస్వాములకు విస్తారంగా మార్కెట్ సమాచారం చేరవేయుట.
- రాష్ట్ర మరియు ప్రాంతాల వారీగా వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపార మరియు వర్తక సమాచారాన్ని విశ్లేషణాత్మకంగా నివేదికలు తయారు చేయుట.

వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రము, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సుమారు 12 రకాల వ్యవసాయ ఉత్పత్తుల (వేరుశనగ, ప్రత్తి, మిరప, పసుపు, మినుము, కంది, పెసర, శనగ, మొక్కజొన్న, బెల్లం, టమోట మరియు జొన్న) మార్కెట్ అంచనా ధరలను నిరంతరంగా వివిధ దఫాలుగా అంచనా వేయబడుతుంది. విత్తే ముందు రైతులు వివిధ పంటల ధరలను తెలుసుకోవటం వలన ఏ పంటకు ఏ ధర వస్తుందో తెలుసుకొని పంటల సరళిని తదనుగుణంగా నిర్ణయించుకోవటానికి అవకాశం ఉంటుంది. మార్కెట్ అంచనా ధరలు కోత ముందు తెలుసుకోవటం వలన రాబోయే నెల రెండు నెలల్లో ఏ ధర పలుకుతుందో తెలుసుకొని నిల్వ ఉంచుకోవాలా? లేక అమ్ముకోవాలా? అనే నిర్ణయంలో తీసుకోవడానికి వెసులుబాటు కల్పిస్తుంది.

మార్కెట్ సమాచారాన్ని వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖలలో నమోదు కాబడిన సుమారుగా 50 లక్షల వ్యవసాయదారుల ఫోన్ నంబర్లకి నిరంతరంగా వివిధ దశలలో ముద్రిత మరియు శ్రవణ సమాచారాన్ని తెలియజేయటంతో పాటు వివిధ వార్తా పత్రికలు, ప్రసార మాధ్యమాల ద్వారా చేరవేయటం జరుగుతుంది. మున్ముందు మార్కెట్ సమాచారంను రిలయన్స్ ఫౌండేషన్ మరియు ఇఫ్కో కిసాన్ సెల్ ద్వారా నమోదిత రైతులకు స్వచ్ఛందంగా చేరవేయుట జరుగుతుంది. ఈ సమాచారమును వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ విభాగాలకు, అన్నపూర్ణ కృషి ప్రసార సేవ (AKPS) ప్రాజెక్టుకు ప్రభుత్వ వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖల వారికి అందించడం జరుగుతుంది.

ఈ కేంద్రం 2019-20 సం॥పు ఖరీఫ్ కాలంలో సాగు చేసే వివిధ రకాల పంటల ముందస్తు ధరలను పంట కోత సమయంలో ఏ విధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది. ఈ ముందస్తు ధరలను అంచనా వేయుటకు రాష్ట్ర ప్రధాన పంటల ముఖ్య మార్కెట్లలోని 16 నుండి 28 సం॥ల నెలవారీ మార్కెటు ధరలను తీసుకుని విశ్లేషణ చేయటం జరిగింది. ఈ విశ్లేషణ ఫలితాలను మరియు మార్కెటు సర్వేలను అనుసరించి 2019-20 పంట కోత సమయంలో ధర ఏ విధంగా ఉండునో ఈ క్రింది విధంగా అంచనా వేయడం జరిగింది.

| క్ర. సం. | పంటలు | అంచనా ధరలు (క్వి/రూ) | అంచనా ధరలు వర్తించు సమయం |
|---|---|---|---|
| 1. | ప్రత్తి | 4800-5200 | నవంబరు-డిసెంబర్, 2019 |
| 2. | మిరప | 7000-7500 | ఫిబ్రవరి - మార్చి, 2020 |
| 3. | కంది | 4800-5100 | ఫిబ్రవరి - మార్చి, 2020 |
| 4. | పసుపు | 5900-6200 | ఫిబ్రవరి - మార్చి, 2020 |
| 5. | మొక్కజొన్న | 1650-1800 | అక్టోబరు-నవంబరు, 2019 |
| 6. | జొన్నలు | 1750-1900 | అక్టోబరు-నవంబరు, 2019 |
| 7. | మినుము | 5200-5600 | అక్టోబరు-నవంబరు, 2019 |
| 8. | పెసర | 5400-5700 | అక్టోబరు-నవంబరు, 2019 |
| 9. | వేరుశనగ | 4900-5300 | అక్టోబరు-నవంబరు, 2019 |

**గమనిక :** పైన తెలిపిన ధరలను వివిధ పంటల ముఖ్య మార్కెట్‌లో గత 16 నుండి 28 సం॥ల ధరలను విశ్లేషించి అంచనా వేయడం జరిగింది. పంట రకము, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితుల మూలంగా అంచనా ధరలలో మార్పు ఉండవచ్చును. కావున, భవిష్యత్తులో పంట ధరల మార్పునకు ఈ కేంద్రం ఏ విధమైన బాధ్యత వహించదు.

ఖరీఫ్ 2019 పంటల ప్రణాళిక :

ఖరీఫ్‌లో సరైన సమయంలో ఋతుపవనాలు ప్రవేశించినట్లయితే పట్టిక. 4 లో నేల స్వభావాన్ని బట్టి ఏ ఏ పంటలు ఎప్పటివరకు విత్తుకొనవచ్చునో వివరించబడినది. ఋతుపవనాల రాక ఆలస్యమై ప్రధాన పంటలు విత్తుకొనలేని పరిస్థితులలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎప్పట్టికప్పుడు విడుదల చేసే ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను పరిగణనలోనికి తీసుకొని పంటలను సాగు చేసుకోవాలి.

**పట్టిక 4 : రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నేలల స్వభావం, పంటల సరళి మరియు విత్తు సమయం**

| రాయలసీమ | | | | కోస్తా ఆంధ్ర | | | |
|---|---|---|---|---|---|---|---|
| తేలిక నేలలు | | బరువు నేలలు | | తేలిక నేలలు | | బరువు నేలలు | |
| పంట | విత్తుటకు చివరి తేది | పంట | విత్తుటకు చివరి తేది | పంట | విత్తుటకు చివరి తేది | పంట | విత్తుటకు చివరి తేది |
| వేరుశనగ | జూలై 31 | జొన్న | జూన్ 30 | చిరుధాన్యాలు | జూలై 10 | పెసలు | జూన్ 30 |
| పెసలు | జూన్ 30 | ఆముదం | జూలై 31 | మొక్కజొన్న | జూలై 10 | మినుము | జూలై 10 |
| చిరుధాన్యాలు | జూలై 10 | కంది | జూలై 31 | కంది | జూలై 31 | సోయాచిక్కుడు | జూలై 31 |
| జొన్న<br>కంది | జూన్ 30<br>జూలై 31 | సజ్జ<br>ప్రత్తి | జూలై 16<br>జూలై 31 | పెసలు | జూన్ 30 | ప్రత్తి + సోయా చిక్కుడు | జూలై 31 |
| ఆముదం | జూలై 31 | | | | | మొక్కజొన్న | జూలై 31 |
| కంది + వేరుశనగ | జూలై 31 | | | | | ఆముదం, కంది + సోయాచిక్కుడు | జూలై 31 |